

మేఘనను సన్మానించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

అంతర్జాతీయ కరాటే పోటీలకు మేఘన ఎంపిక

● సన్మానించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన ముషీరాబాద్ నివాసి వీరమల్ల శ్రీనివాస్ కుమార్తె వీరమల్ల మేఘన త్వరలో దుబాయ్‌లో జరిగే అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపిక కావడంతో ఆమెను ఆదివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ సన్మానించి అభినందించారు. వీరమల్ల మేఘన 6వ తరగతి చదువుతోంది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో మేఘన గోల్డ్‌మెడల్ సాధించారు. కాగా ఢిల్లీల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ తన నియోజకవర్గానికి చెందిన మేఘన అతి చిన్న వయస్సులోనే గొప్పపేరు సాధించడం విశేషమన్నారు. ఆమె కరాటేలో ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి తనవంతు సహకారం పూర్తిస్థాయిలో అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు వల్లాల శ్యామ్‌యాదవ్, గంట శ్రీనివాస్, మేఘన తండ్రి వీరమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

● కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో మంచినీటి ఎద్దడిని నివారించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. డివిజన్ పరిధిలోని చప్పల్ బజార్, కుద్బిగూడ, మోతీమార్కెట్, సునార్ గల్లీ, ఇందిరానగర్, మౌలానా అజాద్‌నగర్, నింబోలి అడ్డ తదితర ప్రాంతాలలో రెండు రోజులుగా మంచినీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదు మేరకు జలమండలి డీజీఎం కృష్ణతో మాట్లాడి మంచినీటి పైప్‌లైన్ పనుల మరమ్మతు పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు బల్వీర్, అజారిబాబు, బీంరాజ్, వాసు, ఆర్ సంతోష్, రవియాదవ్, నాగు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ సెట్విన్ కేంద్రంలో వివిధ ఉపాధి రంగాల్లో పదవ తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విన్ కేంద్రం ఇన్‌చార్జి సత్యవతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వల్పకాల వ్యవధిలో నామమాత్రపు ఫీజుతో కంప్యూటర్ బేసిక్స్, అకౌంట్ ప్యాకేజ్, ఎంఎస్ ఆఫీసు, హార్డ్‌వేర్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్, మొబైల్ సర్వీసింగ్, డీటీపీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ తదితర 24 రకాల కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ప్రభుత్వం గుర్తింపు సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలను కలిపిస్తున్నామని తెలిపారు. వివరాలకు 9110534518 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సత్యవతి కోరారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యాదవ కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్

స్థానిక సంస్థల్లో యాదవులకు ప్రాధాన్యం ఇవ్వాలి

● మేకల రాములు యాదవ్

బర్కత్‌పుర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవ కులస్థులకు సముచిత స్థానం కల్పించాలని జాతీయ యాదవ కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన చెప్పారు. నామినేటెడ్ పదవుల కేటాయింపులో కూడా యాదవులను గుర్తించాలని ఆయన కోరారు. కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని యాదవులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోరాట సమితి గ్రేటర్ అధ్యక్షులు రవియాదవ్, ఉపాధ్యక్షులు దయాకర్ యాదవ్, ప్రవీణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తేవాలి'

చిక్కడపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తేవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన నవీన్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కిషన్‌రెడ్డిని కలిశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో పది సంవత్సరాలు బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ఇప్పుడు కాంగ్రెస్ ఏడాది పాలనకే ప్రజలు అసహనం ప్రదర్శిస్తున్నారన్నారు. తెలంగాణలో ప్రస్తుతం బీజేపీ పవనాలు వీస్తున్నాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటినుంచే సైనికులవలె పనిచేసి వచ్చే ఎన్నికలనాటికి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తేవడానికి కృ షి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నగర నేతలు రత్నసాయి చంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మార్కండయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు తదితరులు

పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి

● ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు ఐక్యంగా ఉన్నప్పుడే న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండయ్య ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు మార్కండయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 40 లక్షల మంది పద్మశాలీలు ఐక్యంగా ఉన్నప్పుడే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాలలో సముచిత స్థానం కల్పిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు సుదేష్, నాయకులు సంజీవ్‌రావు, గుర్రం శంకర్, బొట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిలాఫలకాలతోనే సరి!

● సీఎంలు శంకుస్థాపన చేసినా ప్రారంభం కాని పనులు

గోల్నాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్య మంత్రులు శంకుస్థాపనలు చేసినా అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. 2004లో హిమాయత్‌నగర్ ఎమ్మెల్యే గంగాపురం కిషన్‌రెడ్డి, తరువాత 2009లో అంబర్‌పేట నియోజకవర్గంగా ఏర్పడ్డగా ఆయన వరుసగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. ఈ పనులన్నీ కిషన్‌రెడ్డి హయాంలోనే ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేశారు. 2019లో, 2024లో కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ ఎంపీగా గెలిచి కేంద్రంలో మంత్రి పదవిలో కొనసాగుతున్నా విటి విషయంలో పట్టించుకుని పనులను చేయించడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

2018లో ఎమ్మెల్యేగా కాలేరు వెంకటేష్ గెలిచిన తరువాత ఆయన కూడా ఈ విషయంలో పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలంటున్నారు. 2023లో మళ్లీ రెండోసారి గెలిచాక ఆయన అంతగా శ్రద్ధ చూపినట్లు కన్పించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రులు శంకు స్థాపనలు చేసిన పనులు పూర్తి చేయాలన్న బాధ్యత అధికారులకు, ప్రజాప్రతినిధులకు లేకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి.



అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తాలో గౌతులచ్చన్న ఆడిటోరియం నిర్మాణానికి 2007లో అప్పటి సీఎం శంకుస్థాపన చేసిన శిలాఫలకం



గోల్నాక కొత్తబ్రిడ్జి నుంచి కృష్ణానగర్ వరకు కనెక్టివ్ బ్రిడ్జి నిర్మాణ పనులకు 2011లో సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

గౌతులచ్చన్న ఆడిటోరియం ఎక్కడ?

అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా సమీపంలో 4263 చదరపుగజాల ప్రభుత్వ స్థలంలో రూ.7 కోట్ల 60 లక్షలతో నిర్మించతలపెట్టిన గౌతులచ్చన్న ఆడిటోరియం నిర్మాణం పనులను 2007 ఏప్రిల్ 19న అప్పటి సీఎం డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 17 ఏళ్లు గడిచినా పనులు ప్రారంభం కాలేదు. తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పడ్డాక టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గౌతులచ్చన్న పేరు కాకుండా మహాత్మ జ్యోతిరావు పూలే భవన్ పేరుతో నిర్మాణం చేయాలని వి.హనుమంతరావు ప్రభుత్వాన్ని సూచిస్తూ పట్టుబడుతూ వస్తున్నారు. ఎన్నికల ముందుకూడా వి.హనుమంతరావు గోల్నాకలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సభలో పీసీసీ అధ్యక్షుడిగా పాల్గొన్న రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈభవన నిర్మాణం చేయాలని కోరడం జరగగా తప్పకుండా చేయిస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. చివరకు శిలాఫలకం కూడా ధ్వంసమై దాని ఆనవాలు కూడా లేకుండా పోయింది.

కనెక్టివ్ బ్రిడ్జి నిర్మాణం ఊసేలేదు

గోల్నాక కొత్త బ్రిడ్జి నుంచి కృష్ణానగర్ వరకు రూ.5 కోట్ల 75 లక్షలతో జీహెచ్ఎంసీ నిర్మించతలపెట్టిన కనెక్టివ్ బ్రిడ్జి నిర్మాణ పనులను 2011 ఆగస్టు 21న అప్పటి సీఎం ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 13 ఏళ్లు గడిచినా పనులు ప్రారంభం కాకపోవడంతో ఇక బ్రిడ్జి నిర్మాణం జరిగేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేసిన పనులపై దృష్టి సారించి ఆ పనులను పూర్తిచేసి ముఖ్యమంత్రి పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాలని, సమస్యల నుంచి ప్రజలను విముక్తులను చేయాలని వేడుకుంటున్నారు.

పూలే భవన్ నిర్మాణం చేపట్టండి



అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా సమీపంలో గౌతులచ్చన్న ఆడిటోరియం నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పూర్తిచేయండి. ఈ భవన నిర్మాణంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇకనైనా నిర్లక్ష్యం వీడి పనులను ప్రారంభించి భవన నిర్మాణం పూర్తిచేయండి.

-రాంపల్లి ప్రభులింగం, ఛే నంబర్

బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేయండి



గోల్నాక కొత్తబ్రిడ్జి నుంచి కృష్ణానగర్ వరకు నిర్మించతలపెట్టిన కనెక్టివ్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి గోల్నాకలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి. వెంటనే ప్రభుత్వం కనెక్టివ్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టి పూర్తి చేయాలి.

-మాగి రాజేష్, గోల్నాక, స్థానికుడు

బీసీలందరూ డిమాండ్ల సాధనకు ఉద్యమించాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీసీలందరూ పార్టీలకతీతంగా న్యాయమైన డిమాండ్ల సాధనకు ఉద్యమాలకు ఉద్యుతం కావాల్సిన అవసరం ఉందని ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య 28న విజయవాడలో ఏపీ బీసీ కుల సంఘాల సమావేశం వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లను రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు బీసీల జనాబా ప్రాతిపదికన 27 శాతం నుంచి 56 శాతం పెంచాలని, ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, క్రిమిలేయర్‌ను తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా నేటీ వరకు బీసీలకు రాజ్యాంగ ఫలాలు పూర్తిస్థాయిలో దక్కకపోవడం శోచనీయమన్నారు. రాజ్యాధికారం లేని జాతులు ప్రజాస్వామ్యంలో బానిసలుగా బతకల్సిందేనని ఇప్పటికైనా బీసీలందరూ బానిస సంకెళ్లు తెంచుకుని ఆత్మగౌరవంతో మేము సగం, మాకు సగం అనే నినాదంతో ముందడుగు వేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్లపై ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కుమార్‌లు చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ నెల 28వ తేదీన ఏపీ బీసీ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఓబీసీ డిమాండ్ల సాధన కోసం 80 బీసీ కుల సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు భరత్‌కుమార్, రాజేందర్, వేముల రామకృష్ణ, నీలం వెంకటేష్, రామకోటి ముదిరాజ్, బలరాం, భాస్కర్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీకగా పండగలు

నల్లకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి పండగలు హిందూ, ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ రహత్‌నగర్‌లోని సయ్యద్ యాకూబ్ అలీ బాబా దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ హాజరై సయ్యద్ యాకూబ్ అలీ బాబా దర్గాలో ఛాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పండగలు హిందూ, ముస్లింలు ఆధ్యాత్మికత చింతనతో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం షేక్ జమీర్ దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాబా దర్గా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



పాలమూరు ఓయూ వీసీ శ్రీనివాస్‌యాదవ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, తదితరులు

బలహీన వర్గాలకు సముచిత న్యాయం


● డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

కవాడిగూడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ పదవులు ఇవ్వడం అభినందనీయమని ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో 4 ఎమ్మెల్యే, ఒక ఎంపీ నియోజకవర్గాలకు పోటీ చేసేందుకు బలహీన వర్గాలకు అవకాశం కల్పించారని అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో యాదవ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి.ఎన్.శ్రీనివాస్‌యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పారదర్శకత కలిగిన నాయకులను వివిధ హోదాలలో నియమిస్తూ వారికి సముచిత స్థానం కల్పించడంలో సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సంఘం రెడ్డి, సుందర్‌రాజుయాదవ్, వెంకన్నయాదవ్, రవీంద్రనాథ్‌యాదవ్, మన్మోహన్‌యాదవ్, బద్రీనాథ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

● జేఏసీ కన్వీనర్ సుద్దాల సురేష్

నల్లకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో రిటైర్డ్ అయిన ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ ఆరోపించారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ బోర్డు మీటింగ్‌లో యాజమాన్యం ఆర్టీసీ కార్మికులకు ఉపయోగపడని ఏ అంశం చర్చించలేదని ఆయన ధ్వజమెత్తారు. ఆదివారం సాయంత్రం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ బోర్డు మీటింగ్‌లో కార్మికులకు సంబంధించిన సమస్యలపై ఏ మాత్రం చర్చించకపోవడం శోచనీయమన్నారు. అదే విధంగా కొత్తగా బస్సుల కొనుగోలు, 2017కు సంబంధించి కార్మికులకు రావాల్సిన బకాయిల కోసం ఏ మాత్రం మాట్లాడలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కండక్టర్లకు కొత్త టిమ్ము మెషిన్లు, మహాలక్ష్మి ద్వారా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎలాంటి చర్చ జరగలేదని ఆయన ఆరోపించారు. పదేళ్ల నుంచి ఆర్టీసీలో 16 వేల మంది కార్మికులు, సూపర్‌వైజర్లు రిటైర్డ్ అయ్యారని, వారికి సెటిల్‌మెంట్ ఇప్పటి కూడా చేయలేదన్నారు. దీనికి కారణం ఆర్టీసీ బోర్డులో కార్మిక నాయకులు లేకపోవడంతో అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



శ్రీ నీలకంఠి సంఘం హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు

నీలకంఠి సంఘం అధ్యక్షుడిగా శంకర్

బర్కత్‌పుర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీ నీలకంఠి సంఘం హైదరాబాద్ 28వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం కాచిగూడలో జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు తుమ్మ హరికిషన్ శేషాంకమౌళి, గవ్వల శ్రీధర్, వీరభత్తిని కృష్ణలు తెలిపారు. ఎన్నికల్లో నూతన అధ్యక్షుడుగా వీరభత్తిని శంకర్, ప్రధాన కార్యదర్శిగా అక్కల సుధాకర్, కోశాధికారిగా బట్టు నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు.

రాజగోపాల్‌నగర్ లే అవుట్‌లో నిర్మాణాలు చేపట్టొద్దు

● ఐలాపూర్ రాజగోపాల్‌నగర్ అసోసియేషన్ డిమాండ్

కవాడిగూడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ పరిధిలోని రాజగోపాల్‌నగర్ లే అవుట్‌లో ఎలాంటి క్రయ విక్రయాలు, నిర్మాణాలు చేపట్టరాదని ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లాడి సందీప్‌కుమార్, కోశాధికారి రమేష్, ఉపాధ్యక్షుడు ఆర్‌వి రామమూర్తి, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మాధవి డిమాండ్ చేశారు. ఈ లే ఔట్‌లోని సర్వే నంబర్ 119 నుంచి 220 వరకు మొత్తం 408 ఎకరాలు కోర్టు కేసు పరిధిలో ఉందని వారు స్పష్టం చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తమ న్యాయమైన సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం అసోసియేషన్ సభ్యులు సేల్ డీడ్ ద్వారా లే ఔట్‌లోని ప్లాట్లను కొనుగోలు చేశారని రాజకీయ నాయకులు అధికారుల ప్రోత్సాహంతో తప్పుడు పత్రాలు సృష్టించి కొంత భూమిని కబ్జా చేశారని వారు ఆరోపించారు. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా కొంతమంది నాయకులు సర్వే నెంబర్లు మార్చి తప్పుడు పత్రాలు సృష్టించి తక్కువ రేటు ఆశచూపి నోటరీ ద్వారా అమామయక ప్రజలకు కట్టబెడుతున్నారని వారు ఆరోపించారు. 40 సంవత్సరాలుగా స్థలాలు కొనుగోలు చేసిన బాధితులు, లబ్ధిదారులు పలుమార్లు కోర్టుకు వెళ్లినా తమకు అనుకూలంగా తీర్పునివ్వడంతో పాటు ఈ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని తీర్పు ఇచ్చిందని వారు తెలిపారు. ఈ లేఔట్‌లో దాదాపు 3 వేల మంది స్థలాలను కొనుగోలు చేశారని, అందులో పోరాటం చేసి అలసిపోయి ఇప్పటివరకు 500 మంది బాధితులు చనిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమసమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో అసోసియేషన్ సభ్యులు శాస్త్రి, కృష్ణ, సుదర్శన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వనం దుశ్యంతల, పద్మసూర్యప్రకాష్ తదితరులు

పద్మశాలీ మహిళలు అన్నిరంగాల్లో ప్రతిభను చాటాలి

చిక్కడపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల పిలుపునిచ్చారు. పద్మశాలి సంఘం మహిళా విభాగం గాంధీనగర్ డివిజన్ కమిటీ రూపొందించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ఆదివారం దుశ్యంతల జాతీయ ఉపాధ్యక్షురాలు పద్మాసూర్యప్రకాశ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో పద్మశాలి మహిళలు తమ ప్రతిభను చాటుతూ పురోగమించాలన్నారు. కార్యక్రమంలో విశ్వరేఖ, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, విశ్వనాథం, జాతీయ నేత బి. సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కళాజనార్ధనమూర్తి, జయరాములు

తెలుగుభాషాభివృద్ధికి కొమర్రాజు లక్ష్మణరావు కృషి

చిక్కడపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహానుభావుడు కొమర్రాజు లక్ష్మణరావు అని పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆదివారం కొమర్రాజు లక్ష్మణరావు యాదిలో కార్యక్రమాన్ని ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ తెలుగుభాషతోపాటు తెలుగువారికి విశేష సేవలు అందించిన గొప్ప వ్యక్తి కొమర్రాజు లక్ష్మణరావు అన్నారు. అనేక భాషల్లో గొప్ప పండితులైన లక్ష్మణరావు పరిశోధకులలో అగ్రశ్రేణికి చెందినవారని కీర్తించారు. సమావేశంలో విశ్వసాహితి సంస్థ అధ్యక్షుడు, సుప్రసిద్ధ సాహితీవేత్త డా.బి. జయరాములు తదితరులు పాల్గొన్నారు.



అనాథాశ్రమంలో పేదలకు నిత్యవసరాలు అందజేసిన కల్పన యాదవ్

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరుచుకోవాలి

● మాజీ కార్పొరేటర్ కల్పనయాదవ్

ముషీరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరుచుకొని పేదలను ఆదుకోవాలని మాజీ కార్పొరేటర్ కల్పన యాదవ్ అన్నా రు. ఆదివారం ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో కార్మిక నేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్ యాదవ్ వర్ధంతి సందర్భంగా అనాథాశ్రమం పిల్లలకు నిత్యవసరాలు అందజేశారు. అనంతరం కల్పన యాదవ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్ గౌడ్, నాయకులు అనిల్ యాదవ్, మోహన్‌దాస్, రజని, ఇందిరాప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



ఆశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, బాలకృష్ణ తదితరులు

మహిళల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి

● ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు

ముషీరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ పెద్ద పీట వేసి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు అన్నారు. ఆదివారం బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు ఆశమ్మ సంతాప సభను బీజేపీ మహంకాళి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ఎ. బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశమ్మ చిత్రపటానికి పలువురు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు ఆశమ్మ ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, ముషీరాబాద్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు బద్రినారాయణ, నాయకులు వాసు, రాజశేఖర్ రెడ్డి, మణమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.